క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన 'అన్నా'



మార్కాపురం: ఎంపీ మిథున్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మార్కాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, శివరాంపురం గ్రామ సర్పంచ్ గురుబ్రహ్మం ఉన్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన 'అన్నా'

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని 5వ బ్లాక్ కౌన్సిలర్ ముంగమూరి శ్రీనివాసులును వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మంగళవారం పరామర్శించారు. శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స అనంతరం మార్కాపురంలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాంబాబు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అన్నా వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ సలీమ్, యార్డు మాజీ చైర్మన్ గుంటక శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వివేకానంద కాలేజీలో 1969–70లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక పీఆర్ కాలనీలో గల సంజీవని వృద్ధాశ్రమానికి మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులను పూర్వ విద్యార్థి రామచంద్రారెడ్డి, మిత్రబృందం అభినందించారు. పట్టణానికి చెందిన శేగు సాత్విక్ పుట్టిన రోజు సందర్భంగా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్సు రాకపాయె.. ఆటోలే దిక్కాయే!



బస్సులు రాకపోవడంతో ఆటోలో గిద్దలూరు వెళ్తున్న మహిళలు

రాచర్ల: సమయానికి బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. రాచర్ల మండలంలోని వివిధ గ్రామాల ప్రయాణికులు మంగళవారం కంభం, గిద్దలూరు, మార్కాపురం వెళ్లేందుకు అనుములపల్లె జంక్షన్‌కు చేరుకున్నారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచేసి విసుగెత్తిపోయారు. ఆకవీడు నుంచి గిద్దలూరు వెళ్లే బస్సు స్టీరింగ్ జామ్ కావడంతో అనుములపల్లె జంక్షన్‌లో నిలిచిపోయింది. దీంతో గిద్దలూరు వెళ్లే ప్రయాణికులు గంటకు పైగా ఎదురుచూసినా మరో బస్సు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించారు. మహిళలకు ఉచిత బస్సు అని ప్రచారం చేసుకుంటూ ముప్పుతిప్పలు పెడుతున్నారని అక్కచెల్లెమ్మలు, వృద్ధులు శాపనార్థాలు పెట్టడం గమనార్హం.



అనుములపల్లె బస్‌స్టాండ్‌లో మొరాయించిన ఆర్టీసీ బస్సు

గడ్డు సమయం.. ఒడ్డుకు చేరలేం!



గుండ్లకమ్మ వాగు నీటిలో గుండా శ్మశానవాటికకు వెళ్తున్న రావిపాడు వాసులు(ఫైల్)

- కంభం మండలంలో వంతెనలపై ప్రమాద ఘంటికలు
- వాగు పొంగితే యర్రబాలెం వద్ద రాకపోకలు బంద్
- శిథిలావస్థకు చేరిన రావిపాడు బ్రిడ్జి
- రావిపాడులో చివరి మజిలీకి అడ్డుపడుతున్న గుండ్లకమ్మ వాగు

కంభం: వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓ మోస్తరు వర్షాలకే బ్రిడ్జిల మీదుగా వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వరద సందర్భాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి కంభం రావాలంటే 15–20 కిలోమీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి. కంభం చెరువు ప్రధాన పంట కాల్వలకు ఇరువైపులా రిటెయినింగ్ వాల్స్ దెబ్బతినడంతో వాహనదారులకు ప్రాణ భయం పట్టుకుంది.

యర్రబాలెం బ్రిడ్జికి మోక్షమెప్పుడో?

కంభం మండలం యర్రబాలెం గ్రామ సమీపంలో గుండ్లకమ్మ వాగుపై తక్కువ ఎత్తులోనే ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడం, ఇరువైపులా రిటెయినింగ్ వాల్ లేకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ వాగు రెండు రోజులు ఉధృతంగా ప్రవహించడంతో రైతులు, ఇతర వాహనదారులు, పాదచారులు వాగు దాటేందుకు నానా తంటాలు పడ్డారు. వాగు ప్రవాహం ఎక్కువైతే యర్రబాలెం వాసులు స్వగ్రామానికి చేరుకునేందుకు సుమారు 20 కి.మీ చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వాగుపై నూతన బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శిథిలావస్థలో రావిపాడు బ్రిడ్జి

రావిపాడు సమీపంలోని గుండ్లకమ్మ వాగుపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కంభం నుంచి ఒంగోలు వెళ్లే ప్రైవేట్ వాహనాలు, కార్లు, చీమకుర్తి నుంచి కంకర లోడుతో వచ్చే టిప్పర్లు రావిపాడు మీదుగా వెళ్తే 10 కి.మీ తగ్గుతుందన్న ఉద్దేశంతో ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటాయి.

నిత్యం వందకు పైగా వాహనాలు రావిపాడు బ్రిడ్జి మీదుగా వెళ్తుంటాయి. గుండ్లకమ్మ వాగు ఉప్పొంగిన సమయంలో రావిపాడు–కంభం మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసరంగా వెళ్లాలంటే బేస్తవారిపేట మీదుగా సుమారు 20 కిలోమీటర్లు ప్రయాణించి కంభం చేరుకోవాలి. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మించాలని రావిపాడు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

చివరి మజిలీకీ చిక్కులు!

గుండ్లకమ్మకు వరదొచ్చిన సమయంలో రావిపాడు వాసులు బండ్లరేవు శ్మశానవాటికకు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. ప్రవాహ ఉధృతి తగ్గిన తర్వాత నీళ్లలోనే పాడె మోసుకొంటూ శ్మశానానికి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. మృతుల బంధువుల్లో కొందరు వాగు దాటలేక ఒడ్డునే నిలిచిపోతున్నారు. అలాగే పంట పొలాలకు వెళ్లలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలన్న గ్రామస్తుల కోరిక నేటికీ నెరవేరలేదు.

వంతెనలు నిర్మించాలి



గ్రామానికి దగ్గరలో ఉన్న గుండ్లకమ్మ వాగుపై వంతెన సరిలేదు. అలాగే బండ్లరేవు శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో గుండ్లకమ్మ వాగుపై వంతెన లేకపోవడంతో ఎవరైనా మృతి చెందిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వంతెనలు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

– పెద్దకోటేశ్వరరావు, రావిపాడు

వాగొస్తే రాకపోకలకు ఇబ్బంది



యర్రబాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న గుండ్లకమ్మలో వరద నీరు పారే సమయంలో వాగు దాటేందుకు చాలా అవస్థలు పడుతున్నాం. వాగు దాటే క్రమంలో కొందరు పడిపోయిన సంఘటనలున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలి.

– రంగారెడ్డి, యర్రబాలెం



గతవారం యర్రబాలెం వద్ద బ్రిడ్జి మీదుగా వరద నీరు పోటెత్తడంతో నిలిచిన రాకపోకలు



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన రావిపాడు బ్రిడ్జి

కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్



కొమరోలులో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు



తర్లుపాడులో డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న నాయకులు



గిద్దలూరులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- కూటమి నేతల వేధింపులకు భవిష్యత్‌లో శిక్ష తప్పదు
- ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో వైఎస్సార్ సీపీ నేతలు

బేస్తవారిపేట: టీడీపీ, జనసేన శ్రేణుల దాడులు, పోలీసులు, ఇతర అధికారుల దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నేతలకు అండగా నిలిచి రక్షణ కల్పించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బేస్తవారిపేటలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఎక్కడైనా పార్టీ శ్రేణులకు అన్యాయం జరిగితే వెంటనే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు నమోదు చేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా బాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, యూత్ వింగ్ కన్వీనర్ మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిరంజీవి, మాజీ ఎంపీపీ వెంకటరాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, నాయకులు పి.ఈశ్వరరెడ్డి, కొండా రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపేందుకు వైఎస్ జగనన్న డిజిటల్ బుక్ తీసుకొచ్చారని మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత డిజిటల్ బుక్‌లో నమోదైన బాధితులకు అండగా నిలబడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బి.ఓబులరావు, మున్సిపల్ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, బిక్కా రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంభం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం సాయంత్రం డిజిటల్ బుక్ యాప్, క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నెమలిదిన్నె చెన్నారెడ్డి మాట్లాడుతూ యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మహబూబ్ పీరా, పెద్దకోటేశ్వరరావు, సయ్యద్ ఖాసిం, రఫి, ఆనంద్, సయ్యద్ సలీం, సబ్బసాని సాంబశివారెడ్డి, హుస్సేన్‌బాష, సురేష్, గురుమూర్తి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రవికుమార్, ఎంపీటీసీ షేక్ సుబానీ, నాయకులు మోహన్‌రెడ్డి, వెంగయ్యచౌదరి, గోల్కొండ సుబానీ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు శిక్ష తప్పదు

తర్లుపాడు: రెడ్ బుక్ పేరుతో దమనకాండ సాగిస్తున్న కూటమి నేతలకు భవిష్యత్‌లో శిక్ష తప్పదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురారి, సీనియర్ నాయకులు రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. మంగళవారం తర్లుపాడులో సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో కలిసి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. గడచిన ఏడాదిన్నర కాలంగా వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి చేసి హింసించారని, వాటి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్పంచ్‌లు రమణారెడ్డి, కాశయ్య, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, నాయకులు దాసయ్య, ఎబినేజర్, అంకయ్య, భాస్కర్‌రెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి పగలు, ప్రతీకారాలతో పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టు వెంకటరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు విమర్శించారు. మంగళవారం కొనకనమిట్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్ సీపీ శ్రేణులపై సోషల్ మీడియా యాక్టివిస్టులపై, మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, ఆర్టీఐ జిల్లా విభాగం కార్యదర్శి మందలపు శ్రీనివాసులరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు పాలూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డి, సిద్దానబీ, బైనబోయిన వెంకటేశ్వర్లు, బెరెడ్డి కొండారెడ్డి, చెక్కెర వెలుగొండయ్య, గాయం జయరామిరెడ్డి, మూరావత్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంభం మండల నాయకులు



కొనకనమిట్లలో డిజిటల్ బుక్ క్యూర్‌కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రామోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

కంభం: శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ముందుగా హిందూ, ముస్లిం మత పెద్దల సూచనలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. దసరా గ్రామోత్సవంలో ప్రార్థనా మందిరాల వద్ద సంయమనం పాటిస్తూ, పోలీసుల సూచనల మేరకు ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం అన్ని మతాలవారు కలిసిమెలిసి ఉంటున్నారని, ఒకరిద్దరు చేసే అల్లరి పనుల వల్ల సామరస్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ కమిటీల సభ్యులు జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

70 మందికి హోమియో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న హోమియో డాక్టర్లు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండంలో హోమియో వైద్యశాల డాక్టర్ పి.గిరిధర్, మార్కాపురం డాక్టర్ సైదుబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రంగారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

విజయ దుర్గా పాహిమాం



బేస్తవారిపేట : దుర్గాదేవిగా వాసవీమాత




బేస్తవారిపేట : దుర్గాదేవిగా చౌడేశ్వరీదేవి



గిద్దలూరు : మహిషాసుర మర్దనిగా వాసవీ మాత



అర్ధవీడులో దుర్గాదేవి అలంకరణలో..



గొట్లగట్టు రామాలయంలో



అర్ధవీడులో మహిళల కోలాట ప్రదర్శన



మార్కాపురంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భవానీ భక్తులు

శరన్నవరాత్రి వేడుకలు మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఎనిమిదో రోజు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ఆలయాల్లో అమ్మవారి మూలవిగ్రహమూర్తులను దుర్గాదేవిగా అలంకరించారు. అర్చకులు పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బేస్తవారిపేట : మహిషాసురమర్దనిగా కోటసత్యమాంబదేవి



గిద్దలూరు : కాళికామాత ఆలయంలో భక్తుల యజ్ఞం..



మార్కాపురం : మహా చండిగా జగదాంబ



మార్కాపురం : మహిషాసురమర్దినిగా వాసవీమాత



తర్లుపాడు వేణుగోపాల స్వామి ఆలయంలో కనకదుర్గగా..



మార్కాపురం : ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మిగా..



నందనమారెళ్ల బాలత్రిపుర కోటేశ్వరాలయంలో..



మార్కాపురం : వీరలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు

ఒంగోలు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఒంగోలు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యలను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి మార్కాపురం నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, ఆదిమూలపు లూకా, రోజ్ లిడియా, బూదాల సతీష్ కుమార్, ఎం వరప్రసాద్, బత్తుల కాశయ్య, కటారి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మార్కాపురం టౌన్: పోరాటాలతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని రాయవరం రైల్వేస్టేషన్ వద్ద సీఐటీయూ నాలుగో మహాసభలు ఎ.రంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, స్కీమ్ వర్కర్లు అందరూ ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సీఐటీయూ జెండాను మండల కార్యదర్శి మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రూబెన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, మండల కార్యదర్శి టి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

గిద్దలూరు రూరల్: పర్యావరణహితమైన పరిశుభ్రమైన పట్టణంగా గిద్దలూరును తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. స్థానిక కొండపేట రోడ్డులోని డంపింగ్ యార్డులో మంగళవారం బయోమైనింగ్ క్లీనింగ్ యంత్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో లెగసీ వేస్ట్‌ను బయో మైనింగ్ లేదా బయోరెమిడియేషన్ పద్ధతిలో జల్లిపట్టి ప్లాస్టిక్, మెటల్, గాజు వస్తువులను విభజించి, ఆర్గానిక్ వ్యర్థాలను కంపోస్టుగా మార్చనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

16 మంది జూదరులు అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురం సమీపంలోని పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.13,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పొదిలి రూరల్: ఈగలపాడు గ్రామ పొలాల్లో పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి, రూ.62,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వేమన తెలిపారు.

గిద్దలూరులో వార్డుల సంఖ్య పెంపు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20 వార్డుల సంఖ్యను 27కు పెంచనున్నట్లు స్థానిక కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. ఓటర్ల పెరుగుదల, పురపాలక అభివృద్ధి తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని వార్డుల సంఖ్య పెంచుతున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.